సాక్షి అనకాపల్లి

మంగళవారం, 22, అక్టోబర్, 2024



సకాలంలో అర్జీల పరిష్కారం

పీజీఆర్ఎస్‌కు సోమవారం 206 అర్జీలు వచ్చాయి. అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. 8లో



అధ్యయన యాత్రకు పయనం

జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు పయనమయ్యారు. వీరు బెంగళూరు, మైసూరు కార్పొరేషన్లను పరిశీలిస్తారు. 8లో



నాగుపాముకు చికిత్స

అగనంపూడి: ముంగిసతో పోరులో గాయపడిన నాగుపాముకు స్థానిక పశువైద్యశాల డాక్టర్ లావణ్య సపర్యలు చేసి ప్రాణం కాపాడారు.

న్యూస్‌రీల్

పలకరించిన పొగమంచు



గొలుగొండలో మంచు కురుస్తున్న దృశ్యం

గొలుగొండ: శీతాకాలం రాకుండానే పొగమంచు పలకరించింది. గొలుగొండ, జోగుంపేట, శ్రీరాంపురం, జానకీరాంపురం, నర్సంగబిల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. తెల్లవారు నుంచి ఉదయం 8 గంటలకు వరకు మంచు కురవడంతో వాహనదారులు హెడ్ లైట్లు సహాయంతో వెళ్లాల్సి వచ్చింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

పెరుగుతున్న ‘రైవాడ’ నీటిమట్టం



కళకళలాడుతున్న రైవాడ రిజర్వాయర్

దేవరాపల్లి: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ధాటికి రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.40 మీటర్లకు చేరుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో జలాశయంలోకి 700 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరింది. రెండు, మూడు రోజుల వ్యవధిలో పది సెంటీమీటర్ల మేర నీటిమట్టం పెరిగింది. జలాశయం నుంచి ఖరీఫ్ పంటల సాగుకు ఎడమ కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 75 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు.

‘పెద్దేరు’ నుంచి నీటి విడుదల

మాడుగుల: అత్యంత జల వనరులు గల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో అత్యధిక వర్షాలు కురుస్తుండడంతో సోమవారం సాయంకాలం జలాశయంలోకి 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో అంతే నీటిని ప్రధాన జలాశయం గేటు ద్వారా విడుదల చేస్తున్నామని జేఈ సుధాకర్‌రెడ్డి చెప్పారు.

నాకు నమస్కరించాల్సి వస్తుందనే..

- జగన్ అసెంబ్లీకి రావడంలేదు
- పోలవరం–తాండవ అనుసంధానానికి సీఎం ఆమోదం
- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం: తనకు నమస్కారం చేయాల్సి వస్తుందన్న కారణంతోనే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావడంలేదని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన సోమవారం నాతవరం మండంలో పెదగొలుగొండ – వెదురుపల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. వచ్చే నెలలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని, జగన్ అసెంబ్లీకి వస్తే సరదాగా మాట్లాడుకుందామని అన్నారు. పోలవరం కాలువతో తాండవ ప్రాజెక్టు అనుసంధానానికి సీఎం చంద్రబాబు ఆమోదించినట్లు తెలిపారు. ఈ పనులకు సుమారు రూ.2,900 కోట్లు ఖర్చవుతుందన్నారు. తన వయస్సు పైబడినందున మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమాలు జరిగాయని, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అనుచరులు కోట్లాది రూపాయలు దోచుకున్నారని గబ్బాడలో వేలాది టన్నుల ఇసుక అవతవకలు జరిగాయని, ఉన్నతాధికారులతో విచారణ చేయిస్తే రూ.18 కోట్లు జరిమానా విధించారని చెప్పారు.

ఎస్‌బీఐ గోల్డ్ బాండ్ పథకానికి అప్పన్న బంగారం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన 4.380 కిలోల కచ్చా బంగారాన్ని సోమవారం దేవస్థానం అధికారులు నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌కి తరలించారు. అక్కడ కచ్చా బంగారాన్ని శుద్ధి చేశాక, స్వచ్ఛమైన బంగారం ఎంత వస్తుందో ఆ మేరకు ఎస్‌బీఐ గోల్డ్‌బాండ్ స్కీమ్ సర్టిఫికెట్‌ను దేవస్థానానికి అందిస్తారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీ సుబ్బారావు, తదితరుల సమక్షంలో బంగారాన్ని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ మేనేజర్ నరసింగరావుకి అందించారు. ఎస్‌బీఐ గోల్డ్‌బాండ్ స్కీమ్‌లో 45 కిలోల బంగారం ఉంది.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛంతో నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్





అమరవీరులకు సెల్యూట్ ఇస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్) విధినిర్వహణలో మృతి చెందిన కరణం వరప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.10 వేల చెక్కును అందజేస్తున్న కలెక్టర్

- అమరుల సేవలు వెలకట్టలేనివి
- వారి కుటుంబాలకు అండగా ఉంటాం
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు ఆధ్వర్యంలో అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలు అర్పించే పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తపరుస్తూ, వారికి ఎటువంటి సమస్యలున్నా తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న చైనాతో మన సరిహద్దును రక్షించే క్రమంలో ప్రాణాలర్పించిన 10మంది సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను కొనియాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 216మంది, మన రాష్ట్రంలో ఇద్దరు పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించినట్లు చెప్పారు. ఈనెల 21 నుంచి 31న రాష్ట్రీయ ఏక్తా దివస్ వరకు పోలీసు అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో 1983 నుంచి నేటి వరకు 27మంది పోలీసులు మృత్యువాత పడ్డారన్నారు. అనంతరం 13మంది అమరవీరుల కుటుంబాలకు రూ.10 వేల వంతున చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.అప్పారావు, కె.వి.సత్యనారాయణ, ఎ.రామ్‌కుమార్, సీఐలు బాల సూర్యారావు, లక్ష్మి, వినోద్‌బాబు, రమేష్, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట
- సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం
- నూతన ఎస్పీ తుహిన్ సిన్హా



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న తుహిన్ సిన్హా

సాక్షి, అనకాపల్లి: గంజాయి రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని నూతన ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లావ్యాప్తంగా డైనమిక్ చెక్‌పోస్టులను పెంచుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నూతన ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ సిటీ డీసీపీ–2గా విధులు నిర్వహిస్తున్న తుహిన్ సిన్హాను అనకాపల్లి జిల్లా ఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఐపీఎస్–2017 బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హా 2023 నుంచి 2024 వరకు ఏడాదిపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా, 2021–22 ఏడాది పాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పటిష్టంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద గౌరవ వందనం చేసి పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ విజయ కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం..

నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ తుహిన్ సిన్హాకు జిల్లాలో ఉన్న ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతలు, గంజాయి, సైబర్ నేరాల వివరాలు, విచారణలో ఉన్న నేర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, ఏఆర్డీ ఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యరావు, లక్ష్మీ, వినోద్‌బాబు, రమేష్, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్పపీడనం.. అప్రమత్తం!

- తుపానుగా బలపడే అవకాశం
- అధికారులు సర్వసిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుమ్మపాల: దాన తుపాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. అల్పపీడనం వాయుగుండంగా, తుపానుగా బలపడే అవకాశముందని ఆమె హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26 వరకు తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌డబ్ల్యూవోలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని వదిలి వెళ్లరాదని ఆదేశించారు. వర్షాల పట్ల ప్రజలకు ఎల్లప్పుడూ సేవలందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంట్రోల్ రూమ్‌లో 08924–226599, 08924–222888 నంబర్లతో ఫోన్‌లు ఏర్పాటు చేశామన్నారు. వర్షాల కారణంగా మంచినీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు మందులతో వైద్యఆరోగ్య శాఖ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికతో విద్యా శాఖ అప్రమత్తం

అనకాపల్లి: ఈనెల 22, 23, 24 తేదీల్లో తుఫాన్ ఒడిశా సరిహద్దు దాటి ఉత్తరాంధ్ర వైపు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు అప్రమత్తంగా ఉండాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో నిర్మాణ పనులు నిమిత్తం తీసిన గోతులపై మూతలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థ భవనాల్లో విద్యార్థులకు బోధించవద్దని, మధ్యాహ్నం భోజనంలో ఉపయోగించే మంచినీరు కలుషితం కాకుండా చూడాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు మోగిన నగారా

- జిల్లాలో 4 మేజర్ నీటి ప్రాజెక్టులకు ఎన్నికలు
- ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం
- ఆయకట్టు నీరు అందే ప్రతి రైతు ఓటరే: కలెక్టర్ విజయ కృష్ణన్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఎన్నికలు జరిగేది వీటికే..
ప్రాజెక్టు కమిటీలు 4
నీటి పంపిణీ సంఘాలు 3
నీటి వినియోగదారుల సంఘాలు 303

ఇదీ షెడ్యూల్

- నవంబరు 21-23 తేదీల మధ్య నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికలు
- 24-26 తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలకు..
- 27-29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీల కార్యవర్గ ఎన్నికలు

సాక్షి, అనకాపల్లి: సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికల నిర్వహణకు సోమవారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో ఉన్న నాలుగు ప్రధాన నీటి ప్రాజెక్టులైన తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల జాబితా తయారీ మొదలుకొని మొత్తం పోలింగ్ ప్రక్రియను 40 రోజుల్లో ముగించేలా రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు సన్నద్ధమవుతున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 21న ప్రారంభించి.. నవంబరు 29వ తేదీ లోగా వివిధ దశలలో ఎన్నికల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 4 ప్రాజెక్టు కమిటీలు, 3 నీటి పంపిణీ సంఘాలు (డిస్ట్రిబ్యూటరీ కమిటీలు–డీసీ), 303 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న నాలుగు జలాశయాల పరిధిలో 1,25,843 ఎకరాల ఆయకట్టు భూమి ఉందన్నారు.

ఎన్నికల నిర్వహణకు 2198 మంది అధికారులు

ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ శాఖ, ఇతర శాఖల నుంచి 668మంది గెజిటెడ్ అధికారులు, 1,530 మంది పోలింగ్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులకు, సిబ్బందికి విధి విధానాలపై అవగాహన కూడా కల్పించామన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం

నోటిఫికేషన్ విడుదలైన సోమవారం నుంచి వచ్చే నెల 13 వరకు ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. పెద్దేరు మినహా అన్ని నీటి ప్రాజెక్టులకు ఓటర్ జాబితాలు ఉన్నాయన్నారు. ఆ లిస్టులను అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు పెద్దేరు జలాశయానికి ఎన్నికలు జరగని కారణంగా ఓటరు జాబితాను కొత్తగా తయారు చేస్తామన్నారు. గ్రామాల వారీగా సర్వే నంబర్ల ఆధారంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. ఆయకట్టు నీరు అందే ప్రతి రైతు ఓటరే ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.త్రినాథ్, డీఈ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక మోసంపై భగ్గు


ఉచిత ఇసుక హామీ అమలులో మోసం చేస్తున్న చంద్రబాబు సర్కారుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహం పెల్లుబికింది. గబ్బాడ డిపోలో 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయకుండా ఐదు నెలలుగా భవన నిర్మాణదారులను, కార్మికులను ఇబ్బందులు పెట్టడంపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేసింది. ఇప్పుడు ఉన్నపళంగా టన్నుకు రూ.1,165 వసూలు చేయడంపైనా చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు అవినీతినిపైనా దుయ్యబట్టింది.



మహాత్మ గాంధీ విగ్రహం వద్ద పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- నిరసన ర్యాలీలో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, వారి తరపున వైఎస్సార్ సీపీ అలుపెరగని పోరాటాలు సాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా ప్రజలకు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ కేంద్రం నర్సీపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా మున్సిపల్ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే నిరసన తెలిపారు. అబిద్ సెంటర్‌లోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ర్యాలీ కొనసాగించారు. ర్యాలీ అగ్రభాగాన మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు ఉన్నారు. నిరసన ర్యాలీ పాల్ ఘాట్ సెంటర్ మీదగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆర్డీవో లేకపోవడంతో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు మాజీ ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలో ప్రజలకు ఏమి చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల అవసరాల మేరకు గబ్బాడ డిపోలో 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను డంప్ చేశామన్నారు. డిపో ఇసుక సరఫరా చేయకుండా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అడ్డుపడడంతో ఐదు నెలలుగా నిర్మాణదారులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారని వాపోయారు. ప్రభుత్వం ఆల్టిమేటం జారీ చేయడంతో ఈ నెల 18న రాత్రికి రాత్రే డిపో నుంచి ఇసుక సరఫరా చేపట్టారని ఆరోపించారు. ఉచిత ఇసుక పేరుతో ట్రాక్టర్‌కు రూ.6,500 వసూలు చేస్తున్నారన్నారు. డిపోలోని రూ.7 కోట్ల విలువైన ఇసుక దోపిడీకి తెరలేపారని ధ్వజమెత్తారు. ఉచితం పేరుతో వసూలు చేస్తున్న సొమ్ము ట్యాక్స్ రూపంలో చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే గబ్బాడ డిపో ఇసుక నిల్వ చేశారన్నారు. ఇసుక నిల్వల వల్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఎలాంటి భారం పడలేదన్నారు. అలాంటప్పుడు టన్నుకు రూ.1,165 ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు ఏమి చేశారో చెప్పకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయటంపైనే టీడీపీ నాయకులు కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల హామీలు అటకెక్కించారని విరుచుకుపడ్డారు. ప్రభుత్వం మెడలు వంచేందుకు వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు డాక్టర్ లక్ష్మీకాంత్, నాలుగు మండలాల ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, గజ్జలపు మణికుమారి, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ టౌన్ అధ్యక్షులు ఏకా శివ, పార్టీ మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నాగేశ్వరరావు, సుర్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న గణేష్, పార్టీ నాయకులు

పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

- విచారణ అధికారిగా జెడ్పీ సీఈవోను నియమించిన కలెక్టర్
- ఉమ్మడి విశాఖ జిల్లా అధికారుల నుంచి వివరాల సేకరణ

మహారాణిపేట (విశాఖ): పంచాయతీరాజ్ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంటు (ఈవోపీఆర్ అండ్ ఆర్డీ) బదిలీలపై ఎట్టకేలకు విచారణ చేపట్టారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. బదిలీల ప్రక్రియలో డబ్బులు చేతులు మారడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న అనేక మంది ఈవోపీఆర్ అండ్ ఆర్డీలు మైదాన ప్రాంతానికి రాలేకపోవడం, ప్రతి బదిలీకి డబ్బులు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు గత నెల 22న బదిలీలు చేయగా, వాటిని 30వ తేది వరకు రహస్యంగా ఉంచడంపై కూడా విమర్శలు వచ్చాయి. దీనిపై కూడా విచారణ చేస్తున్నారు. బదిలీల ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ కూడా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తిని విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. సోమవారం జెడ్పీ సీఈవో నారాయణమూర్తి విచారణ చేపట్టారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలు రేపు

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఓటరూ తప్పకుండా గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్(విశాఖ): ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విశాఖ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, అనకాపల్లి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, విజయనగరం జిల్లాకు సంబంధించి మెషినిస్ట్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉన్నాయి. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు www. apprenticeship-india.gov. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు విజయనగరంలోని వీటీ అగ్రహారం గల జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ హాజరుకావాలి.

సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అభ్యర్థులకు నవంబర్ 6న, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అభ్యర్థులు నవంబర్ 7న, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు నవంబర్ 8న హాజరుకావాలి. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్‌లో ఖాళీలు లేనిచో వేరే జిల్లాలో పనిచేసేందుకు అంగీకార పత్రం సర్టిఫికెషన్ సమయంలో రాసి ఇవ్వాలి. మరిన్ని వివరాల కు 08922–294906 నంబర్‌లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

28న అగ్రిగోల్డ్ బాధితుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వై.ఎస్.భద్రం

అనకాపల్లి: అగ్రిగోల్డ్ సంస్థలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులకు పదేళ్లగా న్యాయం జరగలేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు, గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ విలువైన ఆస్తులను విక్రయించి, వచ్చిన సొమ్మును బాధితులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల సదస్సు జరగనున్నట్టు తెలిపారు. అసోసియేషన్ జిల్లా నాయకులు జె్రిపోతుల దుర్గారావు, పోలమరశెట్టి శేషు, మెల్లేటి గోపాలరమణ, కోన లక్ష్మణ, వై.సూరిబాబు, ఎం.చిన అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాలల పనులు త్వరగా ప్రారంభించాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు. పనులపై సమగ్ర శిక్ష అధికారులతో క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి నియోజకవర్గంలోని పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి రూ.3.82 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. గొలుగొండ మండలంలో 17 పాఠశాలలకు రూ.154.98 లక్షలు, మాకవరపాలెంలో 9 పాఠశాలలకు రూ.161.82 లక్షలు, నర్సీపట్నంలో 3 పాఠశాలలకు రూ.65.25 లక్షలు మంజూరు చేశామన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ నరసింగరావు, నర్సీపట్నం డీఈ ఈఈ సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నేడు

ఆరిలోవ: విమ్స్‌లో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఈ శిబిరంలో అంకాలజీ వైద్యులు మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా జరుపుతారన్నారు. దీంతో పాటు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరం ఓపీ బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

సకాలంలో అర్జీల పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 206 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిసున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, తదితరులు

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి సంబంధించిన సమస్యపై అధికారులు నేరుగా మాట్లాడాలన్నారు. సకాలంలో అర్జీలను పరిష్కరించగలిగితే పునరావృతం అయ్యే అవకాశం ఉండదన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను అర్జీదారుడికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌కుమొత్తం 206 అర్జీలు రాగా.. 126 రెవెన్యూ శాఖ, 19 పంచాయతీ రాజ్ శాఖ, 10 పోలీస్ శాఖకు, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవిగా నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 32 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 32 అర్జీలు అందాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి సమస్యలను తెలుసుకుంటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర అంశాలపై అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల నిరసన



ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన తెలుపుతున్న మహిళా వలంటీర్లు

ఎన్నికల హామీ మేరకు రూ.10 వేలు వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు నిరంతరం సేవలు అందించిన తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాజీనామాలు చేసిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకుని, బకాయిలు విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

జనావాసాల మధ్య నుంచి మద్యం షాపు తరలించండి



చోడవరం ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామఅప్పారావు

చోడవరం: జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామఅప్పారావు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని గోవాడ గ్రామంలో పంచాయతీ కార్యాలయం పక్కన, శివాలయానికి అతి సమీపంలో నిత్యం విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగించే రోడ్డులో అధికార పార్టీకి చెందిన ఓ మద్యం సిండికేట్ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసింది. దీంతో నిత్యం మందుబాబులు మద్యం సేవించి రోడ్లపై వీరంగాలు సృష్టిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ షాపును వెంటనే జలవాసాల మధ్య నుంచి తొలగించాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామఅప్పారావు కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో ఆపటు చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బాపునాయుడుకు ఫిర్యాదు చేశారు. షాపును తొలగించకపోతే స్థానిక ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

సంపద సృష్టికి మ్యూచువల్ ఫండ్స్ మంచి మార్గం

- మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత, భద్రత ఎక్కువ
- రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభం
- ఎప్పుడైనా పెట్టుబడిని తిరిగి పొందొచ్చు
- ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చు
- ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్



ఏయూ క్యాంపస్ : మన కోసం మనం సంపదను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం మ్యూచువల్ ఫండ్స్ ఒక మంచి మార్గమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్ చలసాని చెప్పారు. ఆయన సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత ఎక్కువని, భద్రత ఎక్కువని, రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభమని వివరించారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో నిపుణులు లోతుగా అధ్యయనం చేసి మంచి సంస్థల్లో పెట్టుబడి పెడతారన్నారు. అవసరమైనప్పుడు మన పెట్టుబడిని తిరిగి పొందొచ్చని తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్‌లో దాదాపు 15 శాతం వరకు రాబడి సాధిస్తున్నారన్నారు. పదవీ విరమణ ప్లాన్‌లు సైతం దీనిలో ఉన్నాయని వివరించారు. ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చని అన్నారు. ఏఎంఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ సహా మూడు రాష్ట్రాలను దత్తత తీసుకుందని చెప్పారు. మిడ్, స్మాల్ కాప్‌లో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిలో పెట్టుబడులు పెరిగాయని వివరించారు.

ఆర్థిక అక్షరాస్యత పెంచుతున్నాం

ప్రజల్లో ఆర్థిక అక్షరాసత్య పెంచడమే లక్ష్యంగా తమ సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. దేశంలో అక్షరాస్యుల సంఖ్య 70 శాతానికి పైగా ఉండగా, ఆర్థిక అక్షరాస్యత 21 – 22 శాతం మాత్రమే ఉందన్నారు. ఆర్థిక అక్షరాస్యతను పెంచడం ద్వారా ప్రజల్లో పెట్టుబడులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. మన దేశంలో 44 శాతం వరకు పెట్టుబడులు రియల్ ఎస్టేట్ రంగంలో, 22 శాతం బంగారంపై ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా మ్యూచువల్ ఫండ్స్‌లో 65 శాతం పెట్టుబడులు ఉండగా భారత్‌లో మాత్రం 19.7 శాతం మాత్రమే ఉన్నాయని, వీటిని మరింత పెంచుతున్నామని చెప్పారు. ఈ ఫండ్స్‌లో రూ.500 నుంచి పెట్టుబడి పెట్టొచ్చని, త్వరలో దీనిని రూ.250కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది ఈ రంగంలో పెట్టుబడి పెడుతున్నారని, 21 కోట్ల ఫోలియోలు ఉన్నాయని, ప్రస్తుతం రూ. 67.09 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయన్నారు.

ఏపీలో రూ.89 వేల కోట్ల పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.89 వేల కోట్లు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని నాగేశ్వర్ చెప్పారు. వీటిలో రూ.65 వేల కోట్లు ఈక్విటీలో, రూ.15 వేల కోట్లు ఫిక్స్‌డ్ ఇన్‌కం విభాగంలో, మిగిలినవి బ్యాలెన్స్‌డ్‌గా ఉన్నాయని తెలిపారు.

మొదటి స్థానంలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ ఇండియాలో మెదటి స్థానంలో నిలుస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 44 అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు పనిచేస్తున్నాయని, వీటిపై సెబీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. సెబీకి, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు మధ్య అనుసంధానంగా ఏఎంఎఫ్ఐ పనిచేస్తోందన్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థలన్నీ కలిసి ఈ అసోసియేషన్‌ను ప్రారంభించాయన్నారు. సెబీ నియమావళిని ఎప్పటికప్పుడు తమతో పంచుకుంటుందని, తమ నుంచి సూచనలు కూడా స్వీకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మమత ముదిలియార్ వైద్య తదితరులు పాల్గొన్నారు.

ఉరకగెడ్డ నిర్వాసితులకు ప్యాకేజీ అమలు చేయాలి



ఉరకగెడ్డ పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వెంకన్న, తదితరులు

మాడుగుల రూరల్: శంకరం పంచాయతీ ఉరకగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేసి, నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక గిరిజనులతో కలిసి ఉరకగెడ్డ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరకగెడ్డ రిజర్వాయర్ నిర్మాణంతో శంకరం పంచాయతీ శివారు గ్రామాలు చినబోడ్డరేవు, పెద్ద బోడ్డరేవుకు చెందిన 56 గిరిజన కుటుంబాలు సర్వం కోల్పోతున్నారన్నారు. 2005లో విడుదల చేసిన జీవో-68 ప్రకారం నిర్వాసిత కుటుంబానికి ఇంటి స్థలంతో, 56 కుటుంబాలకు రూ.5 కోట్ల వరకు మంజూరు చేస్తామని పేర్కొన్నారని చెప్పారు. కానీ ఇంటి స్థలం, ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణం చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. బాధితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా అధికారులు మోసం చేశారన్నారు. ఇప్పటికైనా పరిహారం అందించకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామని, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు కె.భవానీ, స్థానిక గిరిజనులు ముువ్వల జానీ, బుసరి మల్లుదొర, తదితరులు పాల్గొన్నారు.

ఊపిరిపోసిన కేజీహెచ్ వైద్యులు

- చావుబతుకుల మధ్య ఉన్న రోగికి పునర్జన్మ



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

మహారాణిపేట (విశాఖ): ప్రాణాపాయంలో రోగికి కేజీహెచ్ వైద్యులు ప్రాణం పోశారు. శస్త్ర చికిత్స చేసినా రోగి చనిపోతాడని వివిధ ఆస్పత్రుల వైద్యులు చెప్పినప్పటికీ కేజీహెచ్ వైద్యులు మాత్రం పునర్జన్మ ప్రసాదించారు. వైద్యులు సమన్వయంతో ఆపరేషన్ విజయంతంగా పూర్తి చేసి ఆ కుటుంబంలో ఆనందాన్ని నింపారు. వివరాలు ఇలా.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన హరికృష్ణ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. దగ్గుతోపాటు రక్తం కూడా పడుతోంది. గ్రానైట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న హరికృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో చాలా ఆస్పత్రుల్లో చూపించారు. చివరికి హైదరాబాద్‌లోని నిమ్స్‌ను సంప్రదించారు. శస్త్ర చికిత్సకు రూ.10 లక్షల నుంచి రూ15 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అయితే ప్రాణాలకు గ్యారెంటీ లేదని వైద్యులు తేల్చి చెప్పడంతో బంధువులు అనకాపల్లి తీసుకొచ్చేశారు. అంత డబ్బులు ఖర్చు చేసే స్తోమత కూడా లేకపోవడంతో స్థానికులు సలహా మేరకు ఈ నెల 10న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వైద్యులు మణిత, పద్మజ పర్యవేక్షణలో వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్డియోథొరాసిక్ వార్డులో రోగిని ఉంచి వైద్యం ప్రారంభించారు. పల్మనరీ ఆర్టెరీలో త్రోంబస్ అనే వ్యాధితో రోగి బాధపడుతున్నాడని పరీక్షల్లో నిర్ధారణ అయింది. అంతేకాకుండా పల్మనరీ ఆర్టెరీ ఎడుమ వైపు నుంచి కుడి వైపు కూడా విస్తరించింది. దీని వల్ల ఆ ఆర్టెరీ మూసుకుపోయింది. ఈ సమయంలో ఆపరేషన్ చేస్తే రోగి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. కేజీహెచ్‌లో పలువిభాగాల వైద్యుల సమన్వయంతో ఈనెల 11న రోగికి శస్త్ర చికిత్స నిర్వహించారు. బైపాస్ తరహాలో శస్త్ర చికిత్స చేసి గుండెలో క్లాట్ అయిన రక్తాన్ని, ఇతర భాగాలను తొలగించారు. డాక్టర్ మణిత, డాక్టర్ పద్మజ ఆధ్వర్యంలో ఈ శస్త్ర చికిత్స చేసి 8X3 సెంటీ మీటర్ల పరిధిలో క్లాట్ అయిన రక్తాన్ని తొలగించారు. ఇప్పుడు రోగి ఆరోగ్యంగా ఉన్నాడు. వృత్తి రీత్యాగాని, వంశపారంపర్యంగా ఇలాంటి వ్యాధులు వెయ్యి మందిలో ఒకరికి వస్తాయని డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. ఇప్పుడు రోగి పోస్టు ఆపరేటివ్ వార్డులో చికిత్స పొందుతున్నాడని, తొలగించిన రక్త నమూనాలు, ఇతర భాగాలను పరీక్షలకు పంపినట్టు వివరించారు. త్వరలో డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ పద్మజ తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. సోమవారం రోగిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పరామర్శించారు. ప్రాణాలు కాపాడిని వైద్యులను ఆయన అభినందించారు.

అధ్యయన యాత్రకు కార్పొరేటర్లు పయనం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు సోమవారం పయనమయ్యారు. వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం బయలుదేరాల్సిన వీరంతా రాత్రి 7 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయం నుంచి బెంగుళూరు చేరుకున్నారు. అధ్యయన యాత్రకు 85 మంది కార్పొరేటర్లు ఆసక్తి చూపించినప్పటికీ 71 మంది వెళ్లారు. వీరితో పాటు 14 మంది జీవీఎంసీ సిబ్బంది, ఒక డాక్టర్ ఉన్నారు. అధ్యయన యాత్ర కో-ఆర్డినేటర్‌గా జీవీఎంసీ సెక్రటరీ బి.వి.రమణ వ్యవహరిస్తున్నారు.

టూర్ సాగేదిలా..

ఈ నెల 22న ఉదయం 10 గంటలకు బెంగుళూరు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ఆధునిక మురుగు నీటి నిర్వహణ, మంచినీటి సరఫరా తదితర వాటిపై కార్పొరేటర్లకు అవగాహన కల్పిస్తారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అక్కడి పర్యాటక ప్రాంతాలు సందర్శించనున్నారు. 23న బెంగుళూరు నుంచి మైసూరు వెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు మైసూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం స్థానికంగా ఉండే సందర్శన స్థలాలు సందర్శించనున్నారు. 24న మైసూరు నుంచి బంధీపూర్ వెళ్లి అక్కడ అభయారణ్యం, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. 25న బంధీపూర్ నుంచి ఊటీ వెళ్లనున్నారు. ఊటీతో పాటు కూనూర్‌ను సందర్శించనున్నారు. 26న ఊటీ నుంచి బెంగుళూరు వచ్చి, అక్కడి నుంచి పానాజీ వెళ్లనున్నారు. 27న పానాజీ చారిత్రాత్మక పర్యాటక ప్రాంతాలు సందర్శించనున్నారు. 28న ఉదయం 10 గంటలకు పానాజీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన చేయనున్నారు. అనంతరం విశాఖపట్నం రానున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం



మృతి చెందిన జిలాని

ఎస్.రాయవరం: లారీ, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ బాలుడి మృతి చెందాడు. అడ్డురోడ్డు సమీపంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం పెద బోదిగళం గ్రామానికి చెందిన తాతా మనవళ్లు షేక్ మహ్మద్ ఖాదర్ బాషా, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ(16) కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనక నుంచి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెనక కూర్చున్న జిలాని తూలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న జిలానిని ముందుగా నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించే సరికి బాలుడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. జిలాని ఈ నెల 18న పెదబోదిగళం గ్రామంలో జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలకు కాకినాడ నుంచి బోదిగళంలో ఉంటున్న తాతయ్య ఇంటికి వచ్చినట్టు చెప్పారు. ఎదుగొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కాకినాడలో ఉంటున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వడ్డాది కేజీబీవీ విద్యార్థినులు



ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులతో ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: రాష్ట స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని వడ్డాది కేజీబీవీకి చెందిన 16 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పలు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. వాలీబాల్ పోటీలకు వెంకటపద్మ, జ్ఞానేశ్వరి, శ్యామల, త్రోబాల్ పోటీలకు కె.కార్తీక, ఎస్.యమున, పి.తిరుమల, జె.వాణి, హేమ, ఫుట్‌బాల్ పోటీలకు ఎస్.పూజ, ఎ.దీపిక, వి.ఊర్మిల, ఎస్.హాసిని, ఎస్.దివ్య, జె.లావణ్య, టెన్నీ కాయిట్ పోటీలకు నిహారిక, బాస్కెట్ బాల్‌కు భందవ్య ఎంపికయ్యారన్నారు. త్వరలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను సోమవారం ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

హాకీ పోటీలకు పి.ధర్మవరం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: రాష్ట స్థాయి హాకీ పోటీలకు పి.ధర్మవరం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం డీఎల్పీ స్టేడియంలో అండర్-17 హాకీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన టి.వివేక్, కె.మనోజ్, బి.జయశ్రీ, కె.తోస్వేరి సత్తా చాటారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, పీడీ దీపిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

చెస్ పోటీలకు మునగపాక విద్యార్థిని ఎంపిక



చెస్ పోటీలకు ఎంపికైన మునగపాక విద్యార్థిని మౌనికతో ఉపాధ్యాయులు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్న ఆడారి మౌనిక రాష్ట స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం ఆమెను హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్య చంద్రరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీటీ సన్యాసిరావు అభినందించారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో మౌనిక జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. బాపట్ల జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో మౌనిక పాల్గొంటారని వారు తెలిపారు. తమ స్కూల్‌కు చెందిన మౌనిక రాష్ట స్థాయి చెస్ పోటీలకు ఎంపిక కావడంపై హైస్కూల్ ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హ్యాండ్ బాల్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల సత్తా



ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట: హ్యాండ్ బాల్ అండర్-19 బాల బాలికల జిల్లా జట్టు ఎంపికలో పాయకరావుపేట శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం టౌన్ కొత్త రోడ్డులో ఉన్న మున్సిపాల్ స్టేడియంలో ఈ నెల 18న జరిగిన ఈ పోటీల్లో సత్తా చాటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. బాలురు ఈ నెల 25 నుంచి 27 వరకు విజయనగరం జిల్లా కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో, బాలికలు ఈ నెల 23 నుంచి 25 వరకు కడప జిల్లా రైల్వే కోడూరులోని గవర్నమెంట్ కాలేజీలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. బాలికల జట్టుకు పి.అలేఖ్య, ఆర్.వైష్ణవి, ఎస్.సాహితీ చందన, ఆర్.మోహిత, బాలుర జట్టుకు ఎ.జ్యోతీష్ కుమార్, జి.అభినయ్, బి.యశ్వంత్, కె.జితేంద్ర, ఆర్.కుమార్, వై.జయసత్యకుమార్, కె.వెంకటేష్ ఎంపికయ్యారు. స్టాండ్ బైగా జి.మురళి, ఎస్.గోపి, బి.మౌనిక ఉంటారు.

క్లుప్తంగా

గ్రామ సభకు 83 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కశింకోట: మండలంలోని జి.భీమవరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. భూముల విస్తీర్ణం కొలతల్లో హెచ్చుతగ్గులు సరిచేయాలని కోరుతూ 83 అర్జీలు గ్రామస్తులు అందజేసినట్లు ఆర్‌ఐ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, రీ సర్వే హెచ్‌డీటీ భాస్కరరావు, సర్వేయర్ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభ నేడు

కశింకోట: కశింకోటలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. రీసర్వేలో లోపాలు, ఇతర భూ సమస్యలను పరిష్కరించడానికి అర్జీలు స్వీకరిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జగదీష్ దంపతులు

కశింకోట: కశింకోటలోని వివేకానంద విద్యాసంస్థల ద్వారా ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గుర్తింపుగా సంస్థ కరస్పాండెంట్ మళ్ల జగదీష్, శైలజ దంపతులకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) గుంటూరులో సోమవారం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు జగదీష్ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 523బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,710	5,710
మొదటి రకం	4,700	5,690
రెండో రకం	3,620	4,810
మూడోరకం	3,450	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	: షిర్డీసాయి
వీక్షణం	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

దివ్యాంగులకు వరం.. భవిత కేంద్రం



కొప్పాకలో భవిత కేంద్రం వద్ద దివ్యాంగ విద్యార్థులతో తల్లిదండ్రులు

- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య
- 18 ఏళ్ల లోపు బాలలకు ప్రత్యేక శిక్షణ
- మండలంలో ఈ ఏడాది కొత్తగా 60 మంది చేరిక



కొప్పాక భవిత కేంద్రంలో పిల్లలకు విద్య నేర్పిస్తున్న ఉపాధ్యాయిని



భవిత కేంద్రంలో విద్యార్థికి కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

అనకాపల్లి: సాధారణ పిల్లల మాదిరిగానే దివ్యాంగ బాలలు చక్కగా చదువుకోవాలని ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక భవనంతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి బడి ఈడు దివ్యాంగ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరేలా చర్యలు చేపడుతోంది. అనకాపల్లి మండలం జాతీయ రహదారి కొప్పాక కేఎస్‌ఆర్ పేటలోని ఎలిమెంటరీ స్కూల్‌లో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో గతేడాది 225 మంది దివ్యాంగులు ఉండగా.. ఈ ఏడాది నేటి వరకు 60 మంది పిల్లలను కొత్తగా గుర్తించి ప్రత్యేక శిక్షణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

విద్యా బోధన.. ప్రయోజనాలు

- భవిత కేంద్రంలో 3 నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులకు విద్య బోధిస్తారు.
- దివ్యాంగ పిల్లలను నాలుగు విభాగాలుగా విభజించారు. మైల్డ్, మోడ్రేట్, సివియర్, ప్రొఫౌండ్‌గా గుర్తించి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందిస్తున్నారు.



చవితిని వీధిలో దివ్యాంగ బాలుడిని భవిత కేంద్రంలో చేర్పించాలని కోరుతున్న ఎంఈవో కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు

- మైల్డ్, మోడ్రేట్ దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాలకు తీసుకొచ్చి చదువు చెబుతున్నారు.
- సివియర్, ప్రొఫౌండ్ దివ్యాంగ విద్యార్థులను వారి వారి స్వగృహాల్లోనే ఉంచి ప్రతి శనివారం భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లి విద్య నేర్పిస్తారు. ఒక్కో టీచర్ ఐదుగురు పిల్లలకు బోధిస్తారు.
- భవిత కేంద్రంలో విద్యార్థులకు పాఠశాలల విద్యతోపాటు శారీరక అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి ఫిజియోథెరపీ చేయించడం వల్ల కొంతమంది 80 శాతం సాధారణ పిల్లలు మాదిరిగానే ఉంటూ వారి పనులు చేసుకుంటారు.
- భవిత కేంద్రాలకు ప్రతి రోజు దివ్యాంగ విద్యార్థులను తీసుకువచ్చే వారికి రవాణా నిమిత్తం నెల నెలా ప్రభుత్వం రూ.300 అందజేస్తుంది. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థికి తోడుగా వెళ్లే వ్యక్తికి మరో రూ.300 ప్రతి నెలా ఇస్తుంది.
- దివ్యాంగ విద్యార్థినికి అదనంగా స్టయిఫండ్ రూ.200 ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తుంది.
- ప్రతి ఏటా భవిత కేంద్రంలో ప్రభుత్వమే మెడికల్ క్యాంపు నిర్వహించి దివ్యాంగులకు వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రం, బ్రెయిలి కిట్లు, ఎంఆర్ కిట్లు పంపిణీ చేస్తుంది.
- భవిత కేంద్రాల్లో సదరన్ క్యాంపులు నిర్వహించి బస్‌పాస్‌లు, రైల్వే పాస్‌లపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.
- పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందజేయడం వల్ల వారిలో జ్ఞాపకశక్తి పెరిగి ఉన్నత చదువులకు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు.
- అంగవైకల్యంతో జన్మించిన పిల్లలను భయపడకుండా భవిత కేంద్రాల్లో చేర్పించడం వల్ల వారిలో నైపుణ్యాన్ని వెలికితీసే తల్లిదండ్రులుగా మంచి గుర్తింపు వస్తుంది.

విద్యా బోధన బాగుంది



నా కుమారుడు జయసూర్యచంద్ర మూగ, చెవిటితో జన్మించాడు. పిల్లవాడి భవిష్యత్తు ఏంటో అర్థం కాలేదు. భవిత కేంద్రంలో చేర్పించమని మా గ్రామంలో ఉపాధ్యాయులు చెప్పారు. తుమ్మపాల హైస్కూల్‌లో పేరు నమోదు చేసి, భవిత కేంద్రంలో విద్యకు పంపిస్తున్నాను. ఆరో తరగతి పూర్తి చేసుకుని ఈ ఏడాది 7వ తరగతిలోకి వస్తున్నాడు. ప్రతి రోజూ తుమ్మపాల నుంచి భవిత కేంద్రానికి ఆటోలో వెళ్తున్నాం. అందరి పిల్లల మాదిరిగానే చదువుకుని ఇంటికి వస్తున్నారు.

– ఎస్.జయసూర్యచంద్ర తండ్రి శ్రీనివాస్, తుమ్మపాల

కలెక్టర్ చేతుల మీదుగా ట్యాబ్ తీసుకున్నా..

నాకు రెండు నేత్రాలు సరిగ్గా కనిపించవు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు బాగానే వినిపిస్తున్నాయి. ఆరో తరగతి చదువుతున్న సమయంలో కలెక్టర్ రవిపట్టాన్ చేతుల మీదుగా ట్యాబ్ తీసుకున్నాను. దానిలోనే చదువుకుంటున్నాను. వారానికి మూడు సార్లు నా తండ్రి సహాయంతో భవిత కేంద్రానికి వెళ్తున్నాను. పాఠశాలు బాగానే అర్థమవుతున్నాయి.

– జోసెఫ్, మామిడిపాలెం హైస్కూల్ విద్యార్థి

భవిత కేంద్రాల్లో చేర్పించండి



వివిధ రకాలైన అంగవైకల్యంతో జన్మించిన పిల్లలు భయపడకుండా ఉండేందుకు వారిని తల్లిదండ్రులు దగ్గరలోని భవిత కేంద్రంలో చేర్పించాలి. ప్రభుత్వం భవిత కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య అందిస్తోంది. ఈ ఏడాది కొప్పాక భవిత కేంద్రంలో 60 మంది పిల్లలు కొత్తగా చేరారు. దివ్యాంగ పిల్లలు ముందుగా సమీప ప్రభుత్వ పాఠశాలలో పేరు నమోదు చేయించిన తరువాత భవిత కేంద్రాలకు పంపించాలి.

– ఏసురత్నం, సీనియర్ ఉపాధ్యాయిని, భవిత కేంద్రం

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వెయిట్‌లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీల్లో ధనరాజ్‌కు స్వర్ణం



ధనరాజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్, చిన్నబ్బాయి

అనకాపల్లి: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 విభాగంలో అనకాపల్లి మండలం మామిడిపాలెం హైస్కూల్‌కు చెందిన వి.ధనరాజ్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం బి. శ్రీధర్ తెలిపారు. ఈ నెల 21వ నర్సీపట్నంలో జరిగిన పోటీల్లో 102 కేజీల బరువును ఎత్తి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలియజేశారు. ధనరాజ్‌ను హెచ్‌ఎం శ్రీధర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయిని పి.గౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో వైశాలి..



విజేతలను అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం రవి

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సీహెచ్.వైశాలి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణపతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. వైశాలి ఈ నెల 20న నర్సీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈ ఘనత సాధించింది. వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వైశాలి పాల్గొంటుందని పీడీ వి.ప్రభాకరరావు తెలిపారు. అదే పాఠశాలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు కాంస్య పతకాలను సాధించారు. అండర్ 17 బాలుర విభాగంలో పాల్గొన్న ఎస్.ముఖేష్, రెండు క్రీడా అంశాల్లో కాంస్య పతకాలు, వై.ధాన్‌ప్రసాద్ పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించారు. విజేతలను ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎ.రవి, విద్యాకమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో పలువురికి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

కశింకోట: రాష్ట స్థాయి ఆహ్వానపు కరాటే టోర్నమెంట్‌లో కశింకోటలోని సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. జపాన్ కరాటే మెరిటల్ ఆర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో తునిలో ఆదివారం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సెయింట్ విద్యార్థులు ఎం.డి.ఎస్ లక్ష్మీప్రసన్న, వై.తేజేశ్వర్ బంగారు పతకాలను, జి.మనోజ్ శశిధర్, ఎస్.విశాల్, పి.కుసుమకిరణ్, జి.లిఖిత గ్రేస్ వెండి పతకాలను, బి. శృతి కాంస్య పతకాన్ని సాధించారని స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది సోమవారం తెలిపారు. విజేతలను ఆమెతో పాటు అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సహచరులను గౌరవిస్తే భవిష్యత్ బంగారం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకార్తికేయన్

చోడవరం రూరల్: విద్యార్థి దశలో సహ విద్యార్థులను అధ్యాపకులను గౌరవించడం అలవరచుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగడానికి మార్గమవుతుందని ఎస్‌ఐ శివకార్తికేయ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన అతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమన్న సంగతిని సీనియర్ విద్యార్థులు గమనించాలని సూచించారు. మొదటి సంవత్సర విద్యార్థులు తాము ర్యాగింగ్‌ను ఎదుర్కొన్నట్టయితే తక్షణమే ప్రిన్సిపాల్, అధ్యాపకులతోపాటు పోలీసు డిపార్ట్‌మెంట్‌ను ఆశ్రయించాలని కోరారు. సైబర్ క్రైమ్ చోటుచేసుకునే సందర్భాలు, చిన్న వయసులో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను , ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణం, అదుపుతప్పిన వేగంతో నడపడం వంటి ప్రమాదకర సంఘటనలను వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సును ప్రారంభించిన ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు ఎస్‌ఎం. రఫీయుద్దీన్, హెచ్.సుధీర్, లక్ష్మీమంగమ్మ, హెచ్‌ఓడీలు రామలక్ష్మి, సరస్వతి, కోమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వద్దు

నాతవరం: విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకా లు సకాలంలో అందించే బాధ్యత సీఆర్పీలదేనని ఎంఈవోలు -1, 2 ఓ. సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం సీఆర్పీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో లు మాట్లాడుతూ యుడైసీ ప్లస్ పెండింగ్ లో లేకుండా ఉపాధ్యాయులు చూసుకునేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. తుపాన్ల సమయంలో విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, గోవింద్, సత్యవేణి, కోఆరినేటర్లు శ్రీనివాస్‌నాయుడు, డి.సాంబ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన షేక్ పాపాస అనే బాలిక ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని పట్టణ పోలీస్‌లకు సోమవారం ఫిర్యాదు అందింది. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపిన వివరాలిలా.. షేక్ పాపాస ఈ నెల 18న ఇంటి నుంచి కూరగాయలు తీసుకుని వస్తానని చెప్పి వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. బాలిక తల్లి షేక్ బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మద్యం దుకాణాల ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



సమావేశానికి హాజరైన ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- జనావాసాల మధ్య తక్షణం తొలగించాలి
- బెల్ట్‌షాప్‌లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎంపీపీ గొర్లి సూరిబాబు
- వాడివేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: గుడి, బడి, జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని తక్షణమే తొలగించాలని, గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ మేడపైన ఎంపీడీవో కె.వి. నరసింహారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 14వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తుమ్మపాలలో మెయిన్ రోడ్డు వద్ద బార్, పక్కన కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. బార్ పక్క రహదారిలో నుంచి 14 గ్రామాల ప్రజలు అనకాపల్లి పట్టణానికి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, గతంలో బార్ సమీపంలో ఇద్దరు మహిళల మెడలో నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి పుస్తెలు తాడు తీసుకుని పోయారని, తుమ్మపాల గ్రామం బార్ వద్ద నిత్యం గొడవలు జరుగుతున్నాయని, కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించి, ఉదయం, సాయంత్రం వేళల్లో ఇద్దరు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తూరులో జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దని మహిళలు పెద్ద ఎత్తున ధర్నాలు చేశారన్నారు. మొదటి నుంచి బెల్ట్‌షాప్‌లు లేకుండా చేయడం వల్ల గ్రామాల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తారని చెప్పారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి

మండల పరిధిలో రూ.3 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దశల వారీగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారాయని, మరమ్మతుల నిమిత్తం రూ.63 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.



వైద్య సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూరిబాబు

విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, గత సర్వసభ్య సమావేశాల్లో ప్రస్తావించినప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంలో అధికారుల జాప్యం ఉందని, మూలపేట, సత్యనారాయణపురం, శారదానగర్, మెట్టపాలెం బవులవాడ, కొత్తూరు, కృష్ణాపురం, బీఆర్టీ కాలనీ, వెంకుపాలెం, కొడూరు గ్రామాల్లో ఇంటింటి తాగునీటి పైప్‌లైన్లు నేటికీ వేయ్యలేదన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, విద్యుత్ తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను ఖర్చు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు వివిధ రకాలైన వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, బవులవాడ అంగన్‌వాడీ కేంద్రంలో రాజీనామా చేసి ఆశ వర్కర్ పోస్టును తొమ్మిది నెలలు అవుతున్న నేటికి భర్తీ చేయకపోవడంతో ఏంటని అదికారులను ప్రశ్నించారు.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ శాఖ అధికారులు మాట్లాడుతూ మండలంలోని మామిడిపాలెం, శారదానగర్, కూండ్రం, తుమ్మపాల, రేబాక గ్రామంలో కొత్తగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 31 వరకు మద్యం దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇచ్చారన్నారు. జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేస్తే తమ దృష్టికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లయితే మరో ప్రాంతానికి మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బెల్ట్ షాప్‌లకు పర్మిషన్ లేదని ఎక్కడైన ఏర్పాటు చేస్తే ఎక్సైజ్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని, వారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఒత్తిడి చేసి ఫోన్లు చేయవద్దని ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు.

5,600 ఎకరాల్లో వరిసాగు

మండల ఇరిగేషన్ పరిధిలో గ్రోయిన్లు మరమ్మతు పనులు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వానికి రూ.4 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించామని ఇరిగేషన్ శాఖ డీఈ అమూల్యం చెప్పారు. ఈ ఏడాది వరిసాగులో రైతులకు మేలు జరుగుతుందని, సకాలంలో కురిసిన వర్షాలకు మండల పరిధిలో సుమారుగా 5,600 ఎకరాల్లో వరిసాగు జరిగిందన్నారు. రైతులకు కావలసిన యూరియా, పొటాషియం అందుబాటులో ఉన్నాయని, తుమ్మపాలలో యూరియా, పోటాషియం నిల్వ ఉంచేందుకు అక్కడ ప్రజాప్రతినిధులు గోదామును చూపిస్తే రెండు రోజుల్లో ఎరువులను తీసుకొచ్చి నిల్వ ఉంచుతామన్నారు.

అనంతరం తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీ పరిధి సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు బీపీ మిషన్, స్టెతస్కోప్, చిన్నారుల వెయింగ్ మిషన్లు, 84 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కావాల్సిన రూ.7 లక్షల విలువ చేసే పరికరాలను ఎంపీపీ గొర్లి సూరిబాబు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, ఆర్‌డబ్ల్యూ డీఈ వేణుగోపాల్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరహ సత్యవతి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, వైఎస్ ఎంపీపీలు ఐయితా రాము, విల్లూరి శివకుమారి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా సోమవారం కొరువాడ జగన్నాథపురంలో 96 మందికి సాధారణ వైద్యంతో పాటు ఆరుగురు గర్భిణులను పరీక్షించారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసుకోవాలని సూచించారు. మురుగు లేకుండా చూసుకుంటే, దోమల వ్యాప్తి చెందకుండా ప్రజలు ఆరోగ్యం ఉంటారని వైద్యాధికారి తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.